క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణ లక్ష్యం పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

సత్యవేడు: మండల పరిధిలో 1539 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఏఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ మండలంలో 312 ఇళ్లు రూఫ్ లెవల్‌లోనూ, 87 ఇళ్లు బేస్ మట్టం, 42 ఇళ్లు శ్లాబుల దశలో ఉన్నాయని తెలిపారు. 551 మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదన్నారు.

నీటి తొట్టెకు పైపుల ఏర్పాటు


తొట్టెకు పైపులు అమర్చుతున్న సిబ్బంది

సత్యవేడు : వైఎస్సార్ క్రాంతి పథం, ఉపాధి కార్యాలయాల భవనంపై వర్షపు నీటిని హార్వెస్టింగ్ చేసేలా తొట్టెను ఏర్పాటుచేశారు. దానికి పైపులు అమర్చకుండా అలంకారప్రాయంగా వదిలేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో ఎంపీడీవో చంద్రశేఖర్ స్పందించారు. వెంటనే పైపులు అమర్చి నీరు తొట్టెలో పడేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి ఏపీవో కృష్ణయ్యను ఆదేశించారు. ఆయన సిబ్బందితో పైపులు ఏర్పాటు చేయించారు.

కూలీల సంఖ్యను పెంచాలి

ఏర్పేడు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. మండలంలోని ఆమందూరులో శుక్రవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేనందున కూలీలకు విరివిగా పనులు కల్పించాలన్నా రు. ఎండతీవ్రత అధికంగా ఉన్నందున ఉద యం 6 నుంచి 10 గంటల్లోపు పనులు చేపట్టాల ని సూచించారు. ఏర్పేడు మండలంలో ప్రతి రోజు 4 వేల మంది కూలీలు పనులకు తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సాంకేతిక సహాకుడు రవీంద్రుడు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 50 మంది గైర్హాజర్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ తెలుగు పరీక్షకు 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 142 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. తెలుగు పరీక్ష 75 మంది హాజరుకావలసి ఉండ గా 25మంది మాత్రమే హాజరైనట్లు పేర్కొన్నారు.

వినాయక మండపం పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి వద్ద చేపట్టిన వినాయక మండప పనులను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞానగిరి వద్ద ఉన్న వినాయక మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం రూ.10లక్షల వ్యయంతో పాలకమండలిలో తీర్మానం చేసి పనులు ప్రారంభించామన్నారు. రాబోయే కుమారస్వామి బ్రహ్మోత్సవాల్లోపు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శ్రీనివాసులు, ప్రత్యేక ఆహ్వానితులు కంఠా ఉదయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రెండవ పట్టణ సీఐ రారాజు తెలిపారు. ఆయన కథనం మేరకు వడదెబ్బతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుని వివరాల కోసం ఆరా తీశారు. మృతుని శవాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సర్వభూపాలునిపై శ్రీనివాసుడు


కల్పవృక్ష వాహనంపై మహావిష్ణువుగా దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న


సర్వభూపాల వాహనంలో పద్మావతీ సమేత శ్రీనివాసుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు సర్వభూపాల వాహనంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 4 గంటలకు సుప్రభాతంతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజలు చేశారు. ఏకాంతంగా కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్ల మూలవర్లకు శుక్రవార అభిషేకాలు చేశారు. నిర్మిత హోమశాలలో ప్రత్యేక పూజలు చేసి, తొలి గంటతో దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు స్వామి గోరక్షకునిగా చేత శంఖుచక్రాలు, విశ్లంబులతో సుగంధ పుష్ప మాలికలను, స్వర్ణాభరణాలను అలంకరించుకుని కల్పవృక్ష వాహనంపై అధిష్టించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల మధ్య స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తి ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేద తీరారు. సాయంత్రం పట్టాభిషక్తుడైన వెంకన్న రామావతారంలో ఊంజల్ సేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు సుగంధ పుష్పాలతో ఆంకరించిన సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. పద్మావతీ, ఆకాశరాజు సమేత శ్రీనివాసుడికి మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, అర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ కోదండరామశెట్టి తదితరులు పర్యవేక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ఏకాంత సేవను అర్చకులు నిర్వహించారు.


స్వామి వారి ఊరేగింపులో భక్తుల కోలాటాలు

నేడు గరుడసేవ

ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పక్షి రాజైన గరుత్మంతుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం పల్లకిలో మోహినీ అవతారంలో స్వామి వారు ఊరేగనున్నారు. గరుడసేవ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన అధికారి నాగరాజు తెలిపారు. భక్తులు సమన్వయంతో కర్పూర హారతులను సమర్పించాలని కోరారు.

దళితులపై దాడులు చేయడం సరికాదు

- టీడీపీ నేతలకు తగిన బుద్ధి చెబుతాం
- తప్పుడు కేసులపై న్యాయ పోరాటం చేస్తాం
- అంబేడ్కర్ యువసేన వ్యవస్థాపకుడు పుణ్యమూర్తి


మాట్లాడుతున్న పుణ్యమూర్తి

కేవీబీపురం: దళితులపై టీడీపీ నేతలు, అగ్రవర్ణాల వారు భౌతిక దాడులు చేయడం సరికాదని, పద్ధతి మార్చుకోకుంటే తగిన రీతిలోనే బుద్ధి చెబుతామని అంబేడ్కర్ యువసేన వ్యవస్థాపకుడు చింతమాకుల పుణ్యమూర్తి తెలిపారు. ఈ నెల 13వ తేదీన మండలంలోని రాజులకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ మూకలు స్థానిక దళిత యువకులు, మహిళలపై దాడికి పాల్పడడంపై మండిపడ్డారు. ఆయన శుక్రవారం సత్యవేడు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన దళిత నేతలు, యువకులతో రాజులకండ్రిగలో సమావేశమయ్యారు. ఆయన మట్లాడుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లోకేష్‌నాయుడు, హరికృష్ణనాయుడు, అగ్రవర్ణాలకు చెందిన రేవంత్‌నాయుడు, సునీల్ నాయుడు, హిమాచల్‌నాయుడు పాతకక్షల నేపథ్యంలో రాజులకండ్రిగ అరుంధతివాడకు చెందిన దళిత నేత పరశురాముడిపై మూకుమ్మడిగా దాడి చేశారని తెలిపారు. అడ్డుకున్న అతని భార్యపైనా విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారని పేర్కొన్నారు. దళితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపారు. బాధిత దళితులపైనా తప్పుడు కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిపై జరిగిన దాడుల తాలూకు సాక్ష్యాలతో న్యాయ పోరాటం చేస్తామని, అగ్రవర్ణాల తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నేతలు థామస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పేరాల జయచంద్ర, దళిత వేదిక స్టేట్ అధ్యక్షుడు కేశవరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ వరదరాజులు, రావూరు ప్రసాద్‌బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, చిరంజీవి, గోపి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు

వరదయ్యపాళెం: జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సాగేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఫలితాలు వెలువడిన వెంటనే విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని హెచ్చరించారు. బాణసంచా పేలుళ్లు, విక్రయాలకు కూడా ఆస్కారం లేదన్నారు. ఈ ఆంక్షలన్నీ కూడా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలేనని తెలిపారు. పెట్రోల్ బంకులో గానీ, బయట ప్రాంతంలో గానీ వాహనాలకు తప్ప బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని సూచించారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఎక్కడా నలుగురికి మించి గుంపులుగా ఉండకూడదని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడే రోజున ఎప్పటికప్పుడు సీఐ, ఎస్ఐలు, సిబ్బందితో మొబైల్ పార్టీల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు.

సత్యవేడులో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం


తిరుపతిలో నూకతోటి రాజేష్‌తో పిచ్చాటూరు మండల నాయకులు

పిచ్చాటూరు: సత్యవేడులో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని సింగిల్ విండో చైర్మన్, ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తిరుపతిలో వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను కలిశారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై రాజేష్‌తో చర్చించారు. కేటీ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంతో పాటు నియోజకవర్గంలో మహిళలు ఎక్కువ శాతం ఓటు వేశారని తెలిపారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు వైఎస్సార్ సీపీ వైపు నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఆయన సతీమణి నూకతోటి చైతన్య భానును పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. శ్యాంప్రసాద్ రెడ్డి, పిచ్చాటూరు టౌన్ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, ఎంపీటీసీ వేలు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిపీసూదన్ రావు, ఎస్‌సి, రైతు విభాగ మండల అధ్యక్షులు గోవిందన్, ఆర్‌ఎస్ రాజు, వైస్ సర్పంచ్ శెల్వ పెరుమాళ్, వైఎస్ఆర్‌టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముద్దుక్రిష్ణమరాజు, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు సుమన్, శంకర్ రాజు, మణి రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య కిషోర్

రేణిగుంట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ స్పష్టం చేశారు. రేణిగుంట పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆమె శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రేణిగుంట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి విద్వేషాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా అవగాహన కల్పించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా కోసం 15మొబైల్ టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా పూర్తయిందని పేర్కొన్నారు. కౌంటింగ్ సవ్యంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా ప్రధాన పార్టీల అనుచరులు గ్రామాల్లో రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి సంయమనం కోల్పోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సభలు, ర్యాలీలు, సమావేశాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. 144 సెక్షన్ అమలులోనే ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎవరైనా అనుమానం కలిగే రీతిలో ఉన్నట్లయితే స్థానికులకు సమాచారం అందించాలని సూచించారు. పెట్రోలు బంకుల్లో కేవలం బైక్‌లలో మాత్రమే పెట్రోలు పట్టాలని, బాటిళ్లలో పెట్రోలు పట్టడం నిషేదమని ఇప్పటికే పెట్రోలు బంకుల యాజమాన్యాలకు నోటీసులిచ్చామని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. సామాజిక ప్రసార మాధ్యమాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యర్థులను రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దన్నారు. అలాంటి పోస్టులను నిలువరించకుంటే పరిణామాలకు గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు పికెట్ల ఏర్పాటు

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుపతి జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల తిరుపతి జిల్లాలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొన్ని చోట్ల అవాంఛనీయ సంఘటనలు జరిగిన దృష్ట్యా జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అందులో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ మొబైల్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ తరువాత విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలను నిషేధించినట్లు తెలిపారు. ప్రజలు, పార్టీల నాయకులు పోలీసులకు సహకరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

పోలీసుల మాక్‌డ్రిల్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న ధనుంజయరెడ్డి.


పాండు (ఫైల్)


కేవీబీపురం: మండలంలోని పెరిందేశం దళితవాడకకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తలారి పాండు (48) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, రాజేష్ ఫోన్‌లో పాండు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కోరారు. పాండు మృతదేహానికి రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ తేరని ధనుంజయరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, జెడ్పీటీసీ మునెమ్మ, బీసీ సెల్ మండల కన్వీనర్ హరిబాబు, యువనేత వేనాటి చందు గ్రామానికి చేరుకుని పాండు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.


ఉచిత నీటి, మట్టి నమూనా పరీక్షలు


నమూనా పరీక్షలపై వివరిస్తున్న అధికారులు

పిచ్చాటూరు: మండలంలోని తులసిక్రిష్టాపురంలో శుక్రవారం ఉచిత నీటి, మట్టి నమూనా పరీక్షలను వ్యవసాయ నిపుణులు చేపట్టారు. ఈ సందర్భంగా మట్టి నమూనా అధికారి ఉమామహేశ్వర రెడ్డి మాట్లాడుతూ తులసిక్రిష్టాపురంలో 30 మట్టి నమూనాలు, 4 నీటి నమూనా పరీక్షలు నిర్వహించి ఆయా భూముల్లో నేలసారాన్ని బట్టి ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు చేసినట్టు తెలిపారు. శనివారం కేవీబీ పురం మండలం ఆరె గ్రామంలో నీటి, మట్టి, నమూనా పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు. స్పిక్, గ్రీన్ స్టార్ట్ ఫెర్టిలైజర్స్ ప్రతినిధి అరుణ్ కణ్ణన్, మార్కెటింగ్ అధికారి తిరుమల రావు, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన టీడీపీ నేతలపై చర్యలేవీ?


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మాధవీరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ (ఫైల్)


పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నేతల దౌర్జన్యం (ఫైల్)

కేవీబీపురం: ఈ నెల 13వ తేదీన తిమ్మసముద్రం పోలింగ్ బూత్‌లో స్థానిక టీడీపీ సర్పంచ్ యర్రం దొరబాబునాయుడు, అతని సోదరులు మహిళలపై దాడులు చేసినా ఇప్పటి వరకు పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి సానుకూలంగా ఉన్న ఓటర్లు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటు హక్కును వినియోగించుకునేందుకు తిమ్మసముద్రం గ్రామానికి వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో దొరబాబునాయుడు, అతని అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. అడ్డుకున్న తనపైన, తన భర్త, కుమారుడిపైనా రాళ్లతో దాడిచేసి గాయపరిచారని వాపోయారు. ఈ ఘటనపై అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తమపై దాడి జరిపిన దృశ్యాలు ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఉన్నాయని, వాటిని పరిశీలించి టీడీపీ మూకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

తాగునీటి కోసం గ్రామస్తుల విలవిల


ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు, యానాదివెట్టు, కంచరపాళెం, బత్తలవల్లం, తొండంబట్టు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సర్పంచులు సిద్ధమవుతున్నప్పటికీ అనుమతులు లేవని, బిల్లు లు ఇవ్వలేమంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దాటవేస్తున్నారు. ప్రజల దాహార్తి తీరేదెలా అని ప్రశ్నిస్తుంటే తమకేమీ సంబంధం లేదంటూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్యకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి పరిష్కార మార్గాలను చూడాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మండలంలోని పెద్ద పాండూరు, యానాదివెట్టు, కంచరపాళెం, బత్తలవల్లం, తొండంబట్టు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలంటే అనుమతి తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అడ్డుపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులపై చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు

కమనీయం.. కల్యాణోత్సవం


పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు

శ్రీకాళహస్తి (తొట్టంబేడు) : శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఇతర సభ్యులు ఆలయం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్ల కల్యాణ క్రతువు మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా సాగింది. కార్యక్రమంలో అనుబంధాలయాల అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, అనిల్‌కుమార్‌శర్మ, చెన్నకేశవ స్వామి, శర్మ, అర్ధగిరిస్వామి, ఉభయదారులు అనిల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ

పట్టణంలోని బృందమ్మ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో ఈ తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేని 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఎలాంటి గొడవలు, ర్యాలీలు చేయకూడదన్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉందని గుర్తు చేశారు. అదే విధంగా నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1వ, 2వ పట్టణ సీఐలు, ఎస్ఐలు, 35 మంది పోలీసులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు




తనిఖీలు చేస్తున్న పోలీసులు